విలేజి కండ్రిక రోడ్డులో సమస్యల నెలవు

- వీధి దీపాలు లేక ఇబ్బందులు
- రేయింబవళ్లు వాహనాల రాకపోకలతో ప్రజల ఆందోళన
- వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదన చేసినా పట్టించుకోని వీఎంసీ



కండ్రిక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



కండ్రిక రోడ్డులో లైట్లు లేని విద్యుత్ స్తంభాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విజయవాడ నగరపాలకసంస్థ నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందనే విమర్శలు ఉన్నాయి. విజయవాడ నుంచి 64 డివిజన్‌లో విలేజి కండ్రిక వెళ్లే రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విలేజి కండ్రిక ప్రజలు పలు దఫాలు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. విజయవాడ నుంచి కండ్రిక రావడానికి ప్రధాన రహదారిలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విలేజి కండ్రిక నుంచి కండ్రిక కరకట్ట వరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 3.40 కోట్ల రూపాయలతో నిర్మించిన తారు రోడ్డు సౌకర్యంగా ఉండటం వలన ప్రజల రాకపోకలు పెరిగాయి. విలేజి కండ్రికతో పాటు సమీపంలోని పాతపాడు, వెంకటాపురం, సీతారామపురం ప్రజానీకం ప్రతి అవసరానికి విజయవాడ నగరానికి ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తారు. వెస్ట్ హైవే నిర్మాణం పూర్తి కావడంతో ఆయిల్ ట్యాంకర్లు, గూడ్స్ భారీ వాహనాలు, ట్రాక్టర్లతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు ఇదే రహదారి ప్రయోజనకరంగా ఉంది. దీంతో రేయింబవళ్లు వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో ఈ రోడ్డుపై జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో విలేజి కండ్రికకు చెందిన ఇద్దరు మృతి చెందడంతో రాత్రి సమయాల్లో ప్రయాణం చేసే వారు భయాందోళనకు గురవుతున్నారు.

మేయర్ ఆదేశాలతో డీఈ పరిశీలన..

విజయవాడ నగరానికి శివారు ప్రాంతం కావడంతో మద్యం సేవించే వారు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు అనుకూలంగా ఉండటంతో ప్రజలు రోడ్డుపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు. నగరపాలకసంస్థ విద్యుత్ అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ రెండున్నరేళ్ల క్రితం కండ్రిక రోడ్డులో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం చేయించారు. 60 వీధి దీపాలు అవసరముందని, అందుకు 7 లక్షల రూపాయల వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. అప్పటి నుంచి వీఎంసీ ఎలక్ట్రికల్ అధికారులు పట్టించుకోలేదు. గత నెల 26వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ తిరుపతమ్మ ఈ సమస్యను లేవనెత్తారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి జోక్యం చేసుకొని అధికారులను పిలిచి మాట్లాడిన పిమ్మట ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాస్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలకు సంబంధించి ప్రతిపాదించిన సమస్యలకే దిక్కులేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో కండక్టర్స్ ఏర్పాటు చేస్తాం

విద్యుత్ స్తంభాలకు వీధి దీపాల ఏర్పాటుకు అవసరమైన కండక్టర్స్‌ను ఏపీసీపీడీసీఎల్ ద్వారా అమరుస్తాం. అందుకు ఆ సంస్థ వారు 4.25 లక్షల రూపాయల డిమాండ్ పంపారు.

– బాల సుబ్రహ్మణ్యం, ఏఈ వీఎంసీ

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



విలేజి కండ్రిక -విజయవాడ రోడ్డులో వీధి దీపాల ఏర్పాటు చేయాలి. ప్రతి రోజూ చిరువ్యాపారులు విజయవాడ వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి పొద్దుపోతుంటుంది. ఆ రాత్రి సమయాల్లో ఇంటికి తిరిగి వచ్చే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తోంది. ఆ రోడ్డులో ఇప్పటికే విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటికి వీధి దీపాలను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న వీధి దీపాల ఏర్పాటును అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం సరికాదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.

– యర్రగొర్ల తిరుపతమ్మ, 64వ డివిజన్ కార్పొరేటర్

చిమ్మ చీకట్లో ప్రయాణం ఇబ్బందిగా ఉంది



విజయవాడ నుంచి విలేజి కండ్రిక వచ్చే రోడ్డు రాత్రి వేళ భయంకరంగా ఉంటుంది. ఆ సమయాల్లో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, మద్యం సేవించే వారు ఉంటున్నారు. చీకట్లో ఏమి జరుగుతుందోనని భయపడుతున్నాము. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– సాదం వెంకటేశ్వరరావు, కండ్రిక

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో స్వామీజీలు, సాధువులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుధవారం పలువురు స్వామీజీలు, సాధువులు దర్శించుకున్నారు. ఆనందాశ్రమం పీఠాధిపతి శ్రీ నివాసానంద సరస్వతి స్వామీజీ, పరమాత్మానంద ఆశ్రమం పీఠాధిపతి ప్రకాశానంద సరస్వతి స్వామిజీలతో పాటు పలువురు స్వామీజీలు, సాధువులు అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న ఆషాఢ సారె ఉత్సవాలను స్వామీజీలు, సాధువులు వీక్షించారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు. 500 మందికి పైగా సాధువులు, మాతాశ్రీలు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్థాయీసంఘం సభ్యుల ఎన్నికకు నాలుగు నామినేషన్లు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికకు వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యం ఆధ్వర్యంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్–జనరల్) డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు కార్పొరేటర్లు నామినేషన్ల పత్రాలు సమర్పించారు. 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, 19వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహనా నాహిద్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి నామినేషన్లు దాఖలు చేశారు.

ఇమామ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



పాయకాపురం(విజయవాడరూరల్): సుందరయ్యనగర్‌లోని మసీద్‌లో విధులు నిర్వహించే ఇమామ్‌పై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ కరీముల్లాను బుధవారం ముస్లింలు కలిసి వినతి పత్రం అందజేశారు. సుందరయ్య నగర్ మసీదు చుట్టుపక్కల 100 కుటుంబాల వారు తెలుగులో మాట్లాడే ముస్లిం సోదరులున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. బుధవారం నమాజ్ అయిన పిమ్మట ఖురాన్ చదివే క్రమంలో ఇమామ్ తెలుగు మాట్లాడే ముస్లింలు స్వర్గానికి వెళ్లరని, తెలుగు ముస్లింల గురించి అవమానకరంగా చెప్పినట్లు వారు వినతి పత్రంలో తెలిపారు. ఈ విధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం ద్వారా మసీద్‌లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందన్నారు. ఇమామ్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, అతడిని మార్చాలని కోరారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో షేక్ పెద నాసర్ సాహెబ్, షేక్ అహ్మద్, షేక్ ఖాజావలి తదితరులు ఉన్నారు.

రైల్వేల్లో ప్రైవేటీకరణ నిలిపివేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైల్వేల్లో ప్రైవేటీకరణ, రైల్వే ఆస్తుల విక్రయం తక్షణమే నిలుపుదల చేయాలని అఖిల భారత లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, డివిజనల్ కమిటీ, విజయవాడ బ్రాంచ్(ఎస్సీ డివిజన్) కమిటీ సంయుక్తంగా 'రన్నింగ్ స్టాఫ్ హక్కుల ప్రకటన సదస్సు' నిర్వహించింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ పథకాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేయడంతో పాటు లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రోజుకు పని గంటలు 10 గంటలకే పరిమితం చేయాలని, వరుసగా రెండు రాత్రులకు మించి నైట్ డ్యూటీ చేయించకూడదన్నారు. వారానికోసారి 46 గంటల విశ్రాంతి ఇవ్వాలని, రన్నింగ్ స్టాఫ్ 36 గంటలలోగా హెడ్ క్వార్టర్‌కు తీసుకురావాలని కోరారు. రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై పోరాటం విస్తృతం చేయాలన్నారు. సదస్సులో డివిజన్ సెక్రటరీ ఆర్వీ రాము, లోకో పైలెట్స్ పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో పూజిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తాము వారాహి నవరాత్రి పూజలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రేపు శాకంబరీ అలంకారం

వారాహి నవరాత్రుల చివరి రోజు శుక్రవారం అమ్మవారికి విశేషంగా శాకంబరీ అలంకారం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీ లలితా సహస్రనామ పారాయణం, 9 గంటలకు సారె సమర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాదవితరణ జరుగుతుందన్నారు. ఆషాఢ సారె కార్యక్రమంలో భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీర, స్వీట్స్, చలిమిడి సమర్పించవచ్చునని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

రోడ్లపై వర్షపు నీటి నిల్వలు ఉండకుండా చర్యలు

వీఎంసీ అధికారులకు కమిషనర్ ఆదేశం



డ్రైన్లలో డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం నేపథ్యంలో వీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వర్షపు నీటి నిల్వలు రోడ్లపై ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు, ఏలూరు రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ, కృష్ణలంక, రాణిగారి తోట, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు పరిసర ప్రాంతాలన్నీ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా డీసిల్టింగ్ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూదని, డెంటల్ కాలేజ్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను, సిల్ట్‌ను త్వరితగతిన తొలగించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించొద్దని, నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ కె.షమీ, ఇన్చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, బయాలజిస్ట్ కామేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ తొలి అడుగులో సమస్యల వెల్లువ



62వ డివిజన్‌లో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యల వెల్లువెత్తాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు 62, 63వ డివిజన్లలో బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన పిమ్మట కొత్త పింఛన్లు ఇస్తారని ఎదురు చూస్తున్నామని ఇంత వరకు పింఛన్లు రాలేదని మహిళలు అడిగారు. లబ్ధిదారుడైన భర్త చనిపోతే అతని భార్య పేర కొత్త పింఛన్లు ఇస్తామని దరఖాస్తు చేసుకోవాలని చెప్పారని అవి కూడా ఇంతవరకు రాలేదని మహిళలు ప్రశ్నించారు. పింఛన్లు త్వరలోనే మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రేషన్ కార్డులను కొత్తవి మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నామని, ఎప్పుడు ఇస్తారని అడిగారు. ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన మహిళలకు తొలి అడుగు కరపత్రాన్ని చేతిలో పెట్టి, మీ సమస్యలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తోందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. నియోజకవర్గంలో రూ.240 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్థానిక పార్టీ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. తొలుత 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లో రూ.42 లక్షలతో చేపట్టే పార్కు అభివృద్ధి పనులకు, 63 డివిజన్‌లో తెలుగుతల్లి పార్కులో రూ.12 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

దుర్గాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ దుర్గాపురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలన గురించి వివరించారు. స్థానికంగా ఉన్న డ్రెయినేజీ, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ నాయకులు పాల్గొన్నారు.

6న డాక్టర్ మంగళంపల్లి జయంతి

విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు, పద్మభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతి వేడుకలను జీవీఆర్ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఆర్ ప్రభుత్వ నృత్య కళాశాల, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 6వ తేదీ ఆదివారం సాయంత్రం సంగీత కళాశాలలో జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడు బీవీ మోహన కృష్ణ సంగీత కచేరి, ఆత్మీయ సత్కార కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో గత నెల 23 నుంచి 25వ తేదీవరకు జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో ముత్యాలంపాడు అమలి స్కూలు విద్యార్థులు సత్తాచాటారు. జీ యోగ్యశ్రీ మహాలక్ష్మి గ్రూప్ పుంసే విభాగంలో బంగారు పతకం, పేర్ పుంసే విభాగంలో కాంస్యం సాధించింది. జి.లియోసోనాల్ గ్రూపు పుంసే విభాగంలో బంగారు పతకం, క్యోరూగి 47 కేజీలపై విభాగంలో కాంస్య పతకం సాధించగా, జి.మౌనిష్ పేర్ పుంసే విభాగంలో కాంస్య పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ శారద అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక ధారుడ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ అర్జా వెంకటేశ్వరరావు, కోచ్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అడ్మిన్ సెక్రటరీపై దాడి



సచివాలయ అడ్మిన్ సెక్రటరీ అర్చనపై దాడి చేస్తున్న దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సర్వేలో భాగంగా ఇంటి కొలతలు తీసుకుంటున్న సచివాలయ మహిళా ఉద్యోగిపై తీవ్ర దాడి జరిగిన ఘటన విజయవాడలో బుధవారం చోటుచేసుకుంది. అయితే బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికీ, దీనిపై స్టేషన్‌లో ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. లక్కావఝ్జల అర్చన గవర్నర్‌పేట 98వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీగా పనిచేస్తోంది. ఇంటి పన్ను, ఆస్తి పన్నులు పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా గవర్నర్‌పేట కాంగ్రెస్ ఆఫీసు రోడ్డులోని 27–18–85 డోర్ నంబర్ ఇంటి వద్ద కొలతలు సేకరిస్తోంది. ఆ సమయంలో ఇంటి యజమాని కంతేటి నాగ వెంకట రంగనాయకులు, అతని కుమారుడు కంతేటి యతిరాజ్ నిక్షిత్ వచ్చి ఆమెతో గొడవ పడ్డారు. ఈ సందర్భంగా నిక్షిత్ ఆమె చెంపపై బలంగా కొట్టాడు. రాయలేని పదజాలంతో తీవ్ర స్థాయిలో దూషించాడు. నీ జీవితం నాశనం చేస్తానంటూ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఘటనపై బాధితురాలు గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఈ దాడికి సంబంధించి కేసు లేకుండా రాజకీయ పలుకుబడి వినియోగిస్తున్నట్లు సమాచారం.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల దశలవారీ ఆందోళన



సీడీఎంఏకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు అన్నారు. తాడేపల్లిలోని కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్‌ను బుధవారం కలిసి పలు సమస్యలను విన్నవించారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ జూలై 3 నుంచి 14వ తేదీ వరకు దశలవారీ ఆందోళనలను చేస్తున్నామని, జూలై 15న విజయవాడలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ రంగంలో ఉన్న పార్కు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ ఆఫీస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.21000–24,500 వరకు వేతనాలను పెంచాలని, శాశ్వత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను, రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ తక్షణం విడుదల చేయాలని కోరారు. కార్మికులు రిటైర్/మరణిస్తే వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనుల్లో చేర్చుకోవాలని, కోరారు. 3న ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు, 5న కమిషనర్లకు వినతిపత్రాలు, 7న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 11న కలెక్టరేట్ ఎదురుగా ధర్నాలు, గేట్‌మీటింగ్‌లు, 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రంగనాయకులు వివరించారు.

ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదానం



మెడల్స్ అందిస్తున్న ఉన్నతాధికారులు

పటమట(విజయవాడతూర్పు): ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడ ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదాన కార్యక్రమం బుధవారం స్టెల్లా కళాశాలలో జరిగింది. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కోమోడర్ నర్సింగ్ సైలాని పాల్గొని ఎన్‌సీసీలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదానం చేశారు. క్యాడెట్లు దేశ సేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, 4వ గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, 8వ ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్ అజిత్ సింగ్ రాటీ, 8వ ఆంధ్రా నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్, ఆడమ్ ఆఫీసర్ నాయక్, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్లు, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీ బాబు ఇన్‌స్ట్రక్టర్లు, క్యాడెట్లు పాల్గొన్నారు.

వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీల్లో అన్యాయం



వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల నిర్వహించిన వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీల్లో జీఓ నిబంధనలు పాటించకుండా బదిలీలు నిర్వహించారని, కౌన్సెలింగ్ ద్వారా న్యాయం చేయాలని వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ చైర్మన్ బి.గంటయ్య కోరారు. వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ ఆధ్వర్యాన బుధవారం సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న తమను ఉపయోగం ఉండే అన్ని శాఖలలో తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రమోషన్ చానల్ విషయంలో కూడా తమకు అన్యాయం జరుగుతుందని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయంపై తాను పరిశీలించి న్యాయం చేస్తానని సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ యశ్వంత్, కో కన్వీనర్ శ్రీకాంత్, రాజశేఖర్, యూనియన్ నాయకులు మణికంఠ, మాధురి, గాయత్రి, సునయన, భువన, విద్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభామూర్తుల సేవలను స్మరించుకోవాలి



విజయవాడకల్చరల్: ప్రతిభామూర్తుల సేవలను స్మరించుకోవాలని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మనందరావు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మనందరావు కళా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోస్‌లో సినీ సంగీత విభావరి సేవా మూర్తులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మనందరావు మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు వెంకటేశ్వర్లు, విశ్రాంత పోలీస్ అధికారి ఎం.కృష్ణమూర్తి నాయుడును ఆత్మీయంగా సత్కరించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సింగంశెట్టి చంద్రశేఖర్, కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, బోడి ఆంజనేయరాజు నగరంలో సాంస్కృతిక కళావైభవం అంశంగా ప్రసంగించారు. మల్లాది స్వాతి, అయ్యప్పన్, కె.శ్యాంప్రసాద్ పలు చిత్ర గీతాలను ఆలపించారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం



బ్లడ్ గ్రూప్ శిబిరంలో పాల్గొన్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రక్తదానంతో ఎంతో విలువైన ప్రాణాలను రక్షించవచ్చని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్ అన్నారు. రైల్వే హాస్పిటల్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణపురంలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీసీ)లో బ్లడ్ గ్రూప్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్ ప్రాణాలను కాపాడటంలో రక్తదానం ఎంతో కీలకమన్నారు. రక్తదానం అనేది సరిహద్దులను దాటి నేరుగా ప్రాణాలను రక్షించే గొప్ప చర్య అని అన్నారు. అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాభై మంది ఉద్యోగులు, శిక్షణార్థులు పాల్గొని బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయించుకుని స్వచ్ఛంద రక్తదానంకు ముందుకు వచ్చారు. అనంతరం సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ప్రసన్న లక్ష్మి శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులకు బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈటీటీసీ ప్రిన్సిపాల్ ఎ.సీతారామ్, ఉద్యోగులు,శిక్షణార్థులు పాల్గొన్నారు.